# మూగవాని పిల్లనగ్రోవి

డా. కేశవరెడ్డి



# మూగవాని పిల్లనగ్రోవి

డా॥ కేశవరెడ్డి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | |
|---|---|
| ధర | : రూ. 60/- |
| మొదటి ముద్రణ | : 'ఆంధ్రజ్యోతి' చిత్రవారపత్రిక<br>రీతిక పబ్లికేషన్స్, 1993, |
| HBT మొదటి ముద్రణ | : అక్టోబర్, 2008 |
| ముఖ చిత్రం | : కాళ్ళ |
| పేజ్ సెట్టింగ్ | : విజయ్ |
| ప్రతులకు, వివరాలకు | : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85,<br>బాలాజీ నగర్,<br>హైదరాబాద్ – 500 067,<br>ఫోన్ 040 – 2352 1849. |

---

| | |
|---|---|
| ముద్రణ | : అనుపమ ప్రింటర్స్, గ్రీన్‌వ్యూ,<br>126 శాంతినగర్,<br>హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194 |



# చెప్పకుండా చాలా స్పష్టంగా చెప్పింది

'మూగవాని పిల్లనగ్రోవి' ఒక రైతు మరణ, పునరుత్థానాల గాథ. ఆ రైతు ప్రయత్నం నుంచి వైఫల్యానికీ, వైఫల్యం నుంచి అభద్రతా భావనకీ, అభద్రత నుండి ఉన్మాదానికీ, ఉన్మాదం నుండి మరణానికీ నడిచిన కథ. తన మరణంలో ప్రాణత్యాగం చేసిన తీరు వల్ల కర్మవీరుడై, అమరుడయి, పురాణ పురుషుడైన కథ.

డా॥ కేశవరెడ్డి ఈ కథ ఇతివృత్తం ఎంచుకోవడంలో, కథని చెప్పిన తీరులో అసమాన కౌశల్యాన్ని ప్రదర్శించారు. ఈ కథలో కూడా పురాతన ఆసియా కథన సంప్రదాయాన్ని, ఆదిమ జాతుల విశ్వాస ధోరణిలో చెప్పే నేర్పు వల్ల ఇంతదాకా తెలుగు సాహిత్యంలో మనం వినివుండని అపూర్వ కథనాన్ని ప్రదర్శించారు.

ఈ ఇతివృత్తం దాదాపు ఇరవయ్యేళ్ళ కిందటే ఆయన రాసిన 'స్మశానం దున్నేరు' నవలలో మొదటిసారిగా మనకు వినిపిస్తుంది. ప్రధాన కథతో సంబంధం లేకుండా ఆ నవలలో ప్రసంగవశాత్తూ

తారసపడే ఈ విచిత్ర యితివృత్తం రెండు దశాబ్దాలుగా రచయితను ఎంత ఒత్తిడి చేస్తూ ఉండకపోతే ఇటువంటి కథగా రూపొందుతుంది!

ఈ నవల, లేదా ఈ పెద్ద కథలో సంఘటన క్రమం చాలా స్పష్టం. అయినప్పటికీ ఒక్కసారి చదవగానే అర్థమయ్యే కథలా అనిపించదు. ఒక మధ్య యుగాల మత గ్రంథంలోని గాథలా కనిపిస్తుంది. కాని నిశితంగా చదివి దీర్ఘంగా ఆలోచించిన మీదట పైకి  పుక్కిటి పురాణంలా కనిపించే ఈ కథలో సమకాలీన సాంఘిక ఆర్థిక శక్తులపట్ల ఎంతో శాస్త్రీయమైన అవగాహన నిదానంగా బోధపడుతుంది.

ప్రఖ్యాత సాంఘిక శాస్త్రజ్ఞుడు ఎమెలి దర్క్‌హైంర్కెహేమ్ మతమంటే ప్రపంచాన్ని స్థూలంగా వ్యాఖ్యానించే ప్రయత్నమనే, ఆ ప్రయత్నం మరింత నిశితంగా సంక్లిష్టతలలోకి పోయి చూడగలిగినప్పుడే సైన్స్ అవుతుందనీ రాస్తాడు తన 'ది ఎలిమెంటరీ ఫార్మ్స్ ఆఫ్ ది రెలిజియస్ లైఫ్' అన్న గ్రంథంలో. అలా చూసినట్లయితే, శాస్త్రీయ సిద్ధాంతాలు ప్రాతిపదికగా ప్రపంచాన్ని స్థూలంగా వ్యాఖ్యానించడంతో సరిపెట్టుకొనే రచయితల నడుమ పైకి మత విశ్వాసం లాగా కన్పించే కథలో జీవిత సంక్లిష్టతలని లోపలకీ ఆవిష్కరించే ప్రయత్నం చేసిన డా॥ కేశవరెడ్డి ఎంతో సాహసవంతుడిగా కన్పిస్తాడు.

'మూగవాని పిల్లన గ్రోవి', 'అతడు అడివిని జయించాడు' లాగానే ఒక వీరగాథ. అయితే ఇది ఒట్టి వీరగాథగా ఆగిపోలేదు. ఆ వీరగాథ (legend) ఒక పురాణ ప్రతీక (myth)గా కూడా రూపొందింది ఇక్కడ. ఇక్కడ రచయిత పురాణ ప్రతీకని ఇవ్వడంతో తన పని ముగించినట్లు కనబడినా అది నిజం కాదు. అటువంటి పౌరాణిక ముగింపు (mythological summation)



ఇవ్వడంతోనే అతను మనల్ని వేధించడం మొదలు పెడుతున్నాడు. ఎందుకు ఈ కథ ఇలా ముగిసింది? ఈ కథకు యథార్థమయిన ముగింపు ఇదేనా? ఇటువంటి పర్యవసానానికి కారణాలు ఎటువంటివి? ఇటువంటి ప్రశ్నల పరంపరతో మనం ఆలోచనాపరులం కావడంలోనే రచయిత నిజమయిన విజయం ఉంది. బీదవాళ్ళు భూస్వాములపై తిరగబడ్డారని ఎవరయినా రచయిత ఒక నవలని ముగిస్తే, ఆ ముగింపు మనని ఊరడిస్తుంది. మత గురువుల పరలోకం గురించిన ప్రబోధాల వలె. ఆ ముగింపు మనకి ఇచ్చేది జాగృతి కాదు. విశ్రాంతి, అటువంటి రచన చదివిన తర్వాత మనకెటువంటి అలజడి కలగదు. ఏ ప్రశ్నలూ రేకెత్తవు.

కాని ఎంతో ప్రశాంతంగా, దివ్యంగా కనిపించే ఈ రచనలోని ముగింపు మనని ఎంతో అశాంత పరుస్తుంది. కథలో మణియం వలె మనం కూడా కారణాల అన్వేషణ మొదలుపెడతాం. ఎవరికి తోచిన కారణాలు వాళ్ళు చెప్పడంతో చర్చ మొదలవుతుంది. ఇటువంటి చర్చ నుండి ఒక సామాజిక జాగృతి పొటమరిస్తుంది.

అటువంటి చర్చకు ప్రారంభంగా నాకు తోచిన కారణాలు ఇక్కడ స్థూలంగా మనవి చెయ్యడానికి ప్రయత్నిస్తాను.

'మూగవాని పిల్లనగ్రోవి'లో మూడు అంశాలున్నాయి. ఒకటి బక్కిరెడ్డికీ అతని తండ్రికీ మధ్య అనుబంధం. రెండవది బక్కిరెడ్డికీ అతని తండ్రికీ కూడా వారి భూమితో ఉన్న అనుబంధం, అది చివరికి బక్కిరెడ్డి ఉన్మాదభరిత ప్రాణత్యాగానికి పరిణమించడం, మూడవది బక్కిరెడ్డి మరణం మొదట ఒక జాలి కబురుగా, ఆ పై క్రమంగా ఒక వీరగాథగా, చివరికి పంచభూతాలు అతనికి అనుగ్రహించిన వరప్రదానంగా ఇదంతా ఒక స్థల పురాణంగా రూపొందడం.

ఇటువంటి లెజెండరీ సంప్రదాయంలోనే గురజాడ 'పూర్ణమ్మ', 'కన్యక' కవితలు రాసాడు. ఇటువంటి సంప్రదాయం స్పష్టంగా కనబడకపోయినా కాళీపట్నం మాష్టారి 'యజ్ఞం' కథ ఈ తీరునే నడిచింది. ఇటువంటి రచనల్లో రాజకీయ సమస్య, ఆర్థిక సమస్య. సాంఘిక సమస్య అన్ని రకాల అత్మిక సమస్యలూ ఒక నైతిక సమస్యగా ముడిపడి ఆ నైతిక సమస్య చుట్టూతా పరిభ్రమిస్తాయి. ప్రతియుగంలోని నీతి సమస్య ఆ యుగానికి చెందిన ఆర్థిక విధానాన్ని బట్టి, ఆర్థిక విధానాలపైన ఏర్పడ్డ సాంఘిక సంబంధాల బట్టీ, ఆ ఆర్థిక విధానాల్నీ, సాంఘిక సంబంధాల్నీ నియంత్రించే రాజకీయ స్వభావాన్ని బట్టి పరిష్కరింపబడటమో, పరిష్కరింప బడక పోవడమో ఆధారపడుతుంది. ఇది మనకు సైద్ధాంతిక స్థాయిలో తెలుసు. కన్విన్స్ కాగలం.

కాని సాహిత్య రూపంలో దీన్ని చెప్పగలగడం చాలా కష్టం. అలా చెప్పడానికి ఆ రచయితకి తనదే అయిన మొదటి రకం జీవితానుభవం ఉండాలి. ఆ జీవితానుభవాన్ని అర్థం చేసుకోగలిగే శక్తి ఉండాలి. తిరిగి దాన్ని సాహిత్య రూపంలో సృజించగలిగే నేర్పు ఉండాలి. ఇది ఏ గురజాడ వంటి మహాకవికి మాత్రమే సాధ్యం కాగల ప్రజ్ఞ. అనితర సాధ్యమయిన ఈ నేర్పుని చూపి కేశరెడ్డి ఈ కథ ద్వారా నన్నాశ్చర్య పరిచాడు.

'మూగవాని పిల్లనగ్రోవి' పితృస్వామ్య సాంఘిక సంబంధాలకూ భూస్వామ్య ఆర్థిక విధానాలకూ చెందిన సమాజం మాత్రమే ఊహించగల కథ. భూస్వామ్య సమాజం అర్ధవలస సమాజంగా మారి అటు పెట్టుబడిదారీ విధానాల్నీ అనుసరించలేక ఇటు విశుద్ధ భూస్వామ్య సంబంధాల్నీ పునరుద్ధరించుకోలేక అర్ధ భూస్వామ్య (Semi - Feudal) సమాజంగానూ మనలేక ఆత్మహత్యా సదృశ జీవితానుభవం వైపు నడవడం ఈ కథలో స్పష్టంగా కనిపిస్తుంది.



మనిషి తన అస్తిత్వానికి అర్థాన్ని పశువుల్లో, భూమిలో, రాజ్యంలో మటుకే చూడగలిగినప్పుడు ఈ జీవితం తప్పకుండా అమానవీయమవుతుంది. లోయలో పశువులు పడి చనిపోయినప్పుడు ఉరి తీసుకుని చనిపోయిన పసులకాపరి గురించి 'అతడు అడివిని జయించాడు'లో ప్రస్తావన కొస్తుంది. రాజ్యాన్ని కోల్పోయినప్పుడు బాకుతో తనని తాను పొడుచుకున్న పాళెగాడు కొళందరెడ్డి, భూమిని పోగొట్టుకుని బతకలేకపోయిన బక్కిరెడ్డి ఈ కథలోనే కనిపిస్తారు. మనుషులు తమ జీవిత పరమార్థాన్ని తోటి మనుషులతో కలసి శ్రమించడంలో కాక తమ ఆస్తిపాస్తుల్లో మటుకే చూడగలిగి రావడం నిజంగా విషాదం.

అయితే రైతాంగ సమాజపు ఈ విషాద పరిస్థితి అకస్మాత్తుగా వచ్చింది కాదు. రైతు తనని తాను చంపుకోవాల్సిన పరిస్థితికి వచ్చేముందు తన తోటి మనుషుల్నీ, తన మీద ఆధారపడ్డ మనుషుల్నీ ఎట్లా నిర్మూలిస్తూ వచ్చేడో "చివరి గుడిసె'లో కన్పిస్తుంది. తను తనసాటి మనిషితో సాంఘికంగా విడిపోవడమే రైతు తాలూకు మొదటి మరణం. భూమితో తాను పొందిన తాదాత్మ్యం వల్ల 'స్థావర జంగమాత్మకమైన' తన చుట్టూ ప్రపంచానికీ, తన మనుషులకీ అతనెంత పరాయివాడయి పోయాడో అయిదవ అధ్యాయంలోని బక్కిరెడ్డి అంతర్మథనమే ప్రత్యక్ష వ్యాఖ్యానం.

ఈ మాటలే ఒక సాంఘిక శాస్త్రవేత్త కూడా ఇలా ధృవీకరి స్తున్నాడు. "ఏ రైతు కుటుంబం అయినా భూమిని ఒదులు కోవాల్సి రావడమంటే అత్యంత అయిష్టంతో చేసే పనిగా భావిస్తుంది. ఏమంటే భూమిని ఒదులుకోవడమంటే అది తన బృహత్ భద్రతా భావాన్నీ, తోటి సంఘంలో గౌరవానికి నోచుకునే అవకాశాన్నీ ఒదులుకోవడమే" (పీజంట్స్ ఇన్ ది మోడర్న్ వరల్డ్, యూనివర్శిటీ

ఆఫ్ న్యూ మెక్సికో ప్రెస్, 1969 (భూమిని ఒదులుకోవడమంటే శ్రామికుడిగా బతకవలసి రావడం.) తన ఇంట్లో, తన స్థలంలో కాక ఎదుటివాడి యింట్లో, ఎదుటి వాడి స్థలంలో కాయకష్టం చేయవలసి రావడం. కనుకనే 'కాయకష్టం చేసే అవసరం కలగకపోవడమే భూస్వామ్య సమాజంలో అత్యున్నత గౌరవానికి కొలమానం. తను భూమిని పోగొట్టుకున్నాడని గ్రహించగానే బక్కిరెడ్డికి ముందు తనో గబ్బిలంలాగా అన్పించాడు. కాని తర్వాత మరింత ఆలోచించి గబ్బిలానికున్న జీవితేచ్ఛ కూడా తనకు లేదనుకున్నాడు. భూమి లేకపోవడమంటే తనో 'దొమ్మరి' కావడం. 'పిచ్చగుంటోడు' కావడం. 'నాడోదు' కావడం. రెక్కల శ్రమ అమ్ముకుని బతికే మనుష్య సంఘాల్ని గబ్బిలాలకన్నా హీనంగా భావించినప్పుడే రైతు పూర్తిగా మరణించాడు.

అయితే రైతు వీరమరణం కథేమిటి? ఇది కూడా అర్ధ భూస్వామ్య భావజాలం నుంచి రాగల సహజ ప్రతిస్పందనే. మామూలుగా ఒక మనిషికి అన్యాయం జరిగిందన్నప్పుడు, అతడు సాంఘికంగా ఆర్థికంగా పతనమయ్యాడన్నప్పుడు, బలం, చేవ ఉన్న ఏ సమాజమయినా శత్రువును గుర్తించే ప్రయత్నం చేస్తుంది. కానీ ఇక్కడ శుత్రువు ఎవ్వరూ లేరు.

తను అర్థం చేసుకోలేనిదయినా, బాధాకరమైన ఈ విపత్తు ఒక వ్యక్తికి సంభవించిందే అయినా, ఊరు పూరంతా దిగాలు పడుతుంది. బక్కిరెడ్డి బాధతో మమేకమవుతుంది.

ఇది ఒక రకంగా విశుద్ధ భూస్వామ్య సంస్కృతి విలువ. కానీ ఆ రైతు బావి తవ్వేటప్పుడో, నష్టపోయినప్పుడో ఏకం కాలేని గ్రామం అతను పతనం చెందాక ఏకం కావడంలోనే దాని దివాళాకోరుతనమంతా కనిపిస్తుంది. రైతు బావి తవ్వి, మోటారు బిగించి వ్యాపార పంటలు వేసి పెట్టుబడిదారుడిగా మారినట్లయితే



అప్పుడు ఊరు ప్రతిస్పందించే తీరు వేరేవిధంగా వుండేది. కాని ఈ కథలో వేలం వెయ్యబడ్డ బక్కిరెడ్డి భూమి బంజరుగా ఒదిలిపెట్టబడటం గమనించాలి. ఇది అర్ధ భూస్వామ్య సమాజ లక్షణం. ఇటువంటి అర్ధభూస్వామ్య వ్యవస్థ ఎకాఎకి పెట్టుబడిదారీ వ్యవస్థగా మారడం అసంభవంగా కాగా, చిన్ని చిన్ని వ్యవసాయక వ్యవస్థలు విశాల జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ వ్యవస్థల్లో విలీనమయ్యే పరిణామక్రమంలో కొద్ది మంది భూస్వాములు పెట్టుబడిదారులుగా మారడానికి అత్యధికులు రైతు కూలీలుగా మారవలసి వస్తుంది. ఈ రైతు కూలీగా మారడం రైతాంగ సంస్కృతికి మరణ సదృశ్యమే. 1950లో జరిగినట్టు చెప్పబడిన ఈ రైతుమరణం ఇంకా మనదేశంలో సంభవిస్తూనే ఉంది. ఇంకా చెప్పాలంటే హరిత విప్లవానంతరం ఇది మరింత తీవ్రమయింది. ఆ విధంగా రైతు మరణించిన ప్రతి చోటా ఇటువంటి సానుభూతి పురాణాలే ప్రభవిస్తున్నాయి. ఒకటో అరో ఎక్కడయినా రైతుమరణం రైతాంగ పోరాటానికి దారి తీసినా ఆ పోరాట విధానాల్లోనూ అవే పౌరాణిక విశ్వాసాలు.

అయినప్పటికీ రైతుమరణంలో, ప్రజావిశ్వాసంలో తిరిగి అతను పొందిన పునరుత్థానంలో ఒక అజేయమైన వీరగాథ, అది ఎంత పౌరాణిక మనిపించినా సరే ఉన్నది. ఈ వీరగాథ ఆదిమకాలం నుంచి వికసిస్తూ ఉన్నదే.

టాయన్బీ రాస్తున్నాడు, "ప్రతి ఏటా సస్యాలు బీజాల రూపంలో భూమిలో మరణించి తిరిగి మొలకెత్తడమనేది మానవత్వారోపణ చెంది క్రతువులుగా, పురాణ ప్రతీకలుగా రూపొందడం వ్యవసాయం ఎంత సాధారణమో అంత సాధారణంగా విస్తరించింది" (ఎ స్టడీ ఆఫ్ హిస్టరీ, 1985, పే. 260).

రైతు మరణించాడు. సందేహం లేదు. అతని ప్రాణత్యాగం ఒక రకంగా కీర్తింపదగిందే కాని ఇది వైయక్తికం. ఉన్మాదభరితం. అలాగాక ఆ రైతు తన అనుభవాన్ని తన సాటి మనుషుల అనుభవంగా మార్చగలిగి ఉంటే, వారి కోసం, వారితో కలిసి శ్రమించే అవకాశం కోసం జీవించి ఉంటే ఆ జీవితం మరింత ప్రశంసనీయంగా ఉండి ఉండేది. చెప్పకుండా కేశరెడ్డి చాలా స్పష్టంగా ఈ కథలో చెప్పింది ఇదే అనుకుంటాను.

**- వాడ్రేవు చినవీరభద్రుడు**

హైదరాబాదు

8-6-1996



# 1

మా ఊరిపేరు ఒంటిల్లు. పేరుకు ఒంటిల్లేగాని దాదాపు ఐదు వందల గడపలుంటాయి. చిత్తూరు కడప రాష్ట్ర రహదారి మీద ముప్పై నాలుగో కిలోమీటరు వద్ద రోడ్డుకు తూర్పువైపున ఉందా గ్రామం. ఊరికి తూర్పు వైపున ఒక పర్వత పంక్తి ఉంది. కనుక ఆ ఊళ్లోకి ప్రవేశించడానికి మిగిలిన మూడు వైపుల నుండి మూడు దారులున్నాయి. మీరు గనుక దక్షిణ దిక్కు నుండి ఊళ్లోకి ప్రవేశిస్తే మీకో వింత కనిపిస్తుంది. దారి పక్కన ఊరి మొగదల ఒక పెద్ద గుండు కనిపిస్తుంది. దాదాపు ఇరవై అడుగుల ఎత్తు ఉండే ఆ గుండు నిలబెట్టి ఉన్న కోడి గుడ్డు ఆకారంలో ఉంటుంది. గుండుకు ఎరుపు రంగులోనూ, తెలుపు రంగులోను పెద్ద నామం దిద్దీ ఉంటుంది. ప్రతి దినమూ ఉదయం పూట పూజారి ఆ గుండుకు పూజ చేస్తూ కనిపిస్తాడు. గుండుకు పూజ చేయటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. పూజారిని గాని, అక్కడ, చేరి ఉన్న భక్తులను గాని అడిగితే వారు ఇలా వివరిస్తారు.

“రామాయణ కాలంలో రామరావణ యుద్ధం జరిగింది. యుద్ధంలో లచ్చన్న సావి మూర్ఛబోయినాడు. అప్పుడు

ఆంజినేయల్సావి సంజీవి కొండ నెత్తుకోనొచ్చినాడు. సంజీవి కొండంటే అది నటపటవైన కొండ గాదు. అట్ట నాలుగు యోజినాలు, ఇట్ట నాలుగు యోజినాలు ఉండాది. దాని మీద ఎలులు, పులులు, సిరతలు, సిమ్మాలు తిరగతా ఉండాయి. అట్టాటి కొండను బుజమ్మీద పెట్టుకుని సావి ఆకాశంలో ఎగిరి వస్తా ఉండాడు. ఎగరంగెగరంగ సావికి బరువు తుకమించి పోయింది. ఇక తాళలేక ఊరికాడ ఆగి, ఈ గుండు మీద కాలి బొటనవేలు ఊనుకుని గెడిసేపు గస దీర్చుకున్నాడు. సావి కాలుమోపిన గుండు దేవస్తలవైపోయింది. లచ్చనసావికే గాదు. రావులోరికి గూడా ఎన్నోసార్లు సావు తప్పించాడు ఆంజినేయులు. రావుడు లేకపోయినా రామాయణం ఉంటాది గాని, ఆంజినేయులు లేకపోతే రామాయణం యాడిది? ఇంతరాజ్జి ఉండగా సావి ఊడనేకాలు మోపినాడంటే మా ఊరు జేసుకున్న పుణ్యం అని జెప్పాల. ఆ సావి ఈడ కొలువై ఉండి, ఉరు సుట్టూ వాలం పెంచుకుని, మమ్మల్ని కాలిగోరు మొక్కబోకుండా కాపాడతా ఉండాడు.

## 2

మీరు గనక ఉత్తర దిక్కు నుంచి ఊర్లోకి ప్రవేశిస్తే మీకు మరో వింత కనిపిస్తుంది. చెరువు కట్ట మీద ఒక గుడి కనిపిస్తుంది. గుడి చాలా చిన్నది. పక్కన నిలబడితే అది మీ నడుమెత్తు గూడ ఉండదు. గుడికి ధ్వజస్తంభము, గాలి గోపురము వగైరాలుండవు. రాళ్ళతోను, బండలతోను ఆ గుడి నిర్మించి ఉంది. గుడిలోపల కొయ్యతో చేసిన స్త్రీ మూర్తి ఉంటుంది. ఆ బొమ్మకు పసుపు కుంకుమలు పెట్టి ఉండటం కనిపిస్తుంది. చెరువు కట్టమీద గుడి ఉండటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. చెరువులో చేపలు



పడుతున్న మనిషిని గాని, కట్ట కింద పుట్టగొడుగులు తవ్వుతున్న మనిషినిగాని అడిగితే వాళ్ళు ఇలా వివరిస్తారు :

“ఇది సినమ్మ గుడి. రెండు తరాల క్రితం ఈ పాయకుట్టనంతా ఒకపాళెగాడు. ఆ పాళెగాని కడుగుట్టు కూతురు సినమ్మ. ఈ చెరువును తవ్వించింది. గూడా ఆ పాళెగాడే. చెరువు తవ్విన వేళా విశేషం ఎట్టాటిదో గాని, చెరువునిండి మొరవకాడికి నీళ్ళు రాగానే చెరువు కట్ట గెండిపడిపోయింది. నీళ్ళు ఒక సుక్కలేకుండా ఐపోయింది. పాళెగాడు వొడ్డెరోళ్ళను పెట్టి మళ్ళీ కట్టపోయించినాడు. మళ్ళీ గెండిపడి పోయింది. ఇట్ట కట్టపోయడం, అది గెండి పడిపోవడం, ఇట్లనే కొన్ని ఏండ్లు జరిగి పోయినాయి. చెరువు కింద బూవుల్లో పైరెక్కింది లేదు. ఏవి కారణంగా ఈ కట్ట గెండి పడతా ఉండాదనేది వొడ్డెరోళ్ళకూ గోచిరానికి రాలా. పాళెగానికీ గోచిరానికి రాలా.

ఒక సుక్కురారం పాళెగాడు బాట గంగమ్మకు పూజ పెట్టి ప్రశ్న అడిగినాడు. ‘తల్లీ నేను తవ్వించిన చెరువు ఏవిటి గిట్ట గెండి పడిపోతూ ఉంది? నా దోసవేవి? నా పాతకవేవి అనడిగాడు. గంగమ్మ పూజారిమీద పూని “బాలా”. నీ దోస వేందనీ, నీ పాతకవేందనీ సెప్పేదానిగ్గాదు నేనీడుండేది. కట్ట నిలవాలంటే నువ్వు జెయ్యాల్సిన పని చెప్తాను. పెండ్లి కాని ఒక ఆడకూతుర్ని దెచ్చి బతికుండగానే ఆగెండిలో కూసోబెట్టి మన్నుతోసెయ్. కట్ట నిలుస్తుంది.” అన్జెప్పింది. ఆ మాటినంగానే పాళెగానికి నెమ్మొలిరిగి పోయి నాయి. ముసిల్దో, ముతకదో ఐతే యట్టన్నా చెయ్యొచ్చు. పెండ్లిగాని పిల్లను అందులోనూ పానాల్తో ఉండేదాన్ని గెండిలో పూడ్చెయ్యడం ఎంత పాతకం. ఆయన ఈ రాజ్జానికి పాళెగాడు. పలానోని కూతుర్ని తీసుకొచ్చి గెండిలో ఎయ్యంౘ్రా అంటే ఏసేస్తారు. ఎంతో సేపు పట్టదు. మల్ల ఆ పాపం ఈడేరేదెప్పుడు?

ఇట్టజూస్తే చెరువు. కింద బావులు ఎండిపోయి జనం అగోరిస్తా ఉండారు.

ఏవి జేతురా భగవంతుడా అన్జెప్పి పాళెగాడు ముసుగుదన్ని, ఏసిన పడకెత్తకుండా పడుకున్నాడు. ఎయ్యి పుట్ల జరవొచ్చేసింది. మనోవ్యాధి పట్టుకునింది.

అప్పుడు ఆయన కడగొట్టు కూతురు – సినమ్మ – పెండ్లీడు కొచ్చిన బిడ్డ తండ్రి దగ్గిరకొచ్చి "తండ్రీ నువ్వు దిగులు పడేదేవిటికి? రాజ్యంలో జనం నీళ్ళులేక అగోరిస్తా ఉంటే పాళెగాడు ఇట్ల ముసుగు పెట్టిపడుకోవటం న్యాయవా? నువ్వు నీ జనాన్ని సాకేటోనివా? సంపేటోనివా? లెయ్. బాట గంగమ్మ చెప్పిన ప్రకారం చెయ్యి. నన్ను దీసకపోయి గెండిలో పూడ్చి పెట్టు. నాకు అడ్డు చెప్పొద్దు. నేను గెండిలో కూసునే దానికే మనసు జేసుకున్నా. దానిగ్గా వలసినేర్పాట్లు సూడు." అన్జెప్పింది. పాళెగాని దుఃఖం చెప్పేదానిగ్గాదు. కాళ్ళు కడిగి కన్యాదానం చెయ్యాల్సిన బిడ్డను, బతికుండగానే పూడ్చి పెట్టాలంటే కన్నోనికి మనసొచ్చునా? ఐతే గంగమ్మ మాటకు యట్ట తిరుగులేదో, అట్ట సినమ్మ మాటకు కూడా తిరుగులేదు. ఆమె మొండి పట్టు పట్టింది. సరే తండ్రి ఏడ్చినాడు మొత్తుకున్నాడు. అంతా అయింది. బాపనాయన మూర్తం పెట్టినాడు. సినమ్మ తలంటి స్నానం చేసింది. పట్టుకోక కట్టింది. పట్టు రైక తొడిగింది. వొంటినిండా నగలు పెట్టుకునింది. పెండ్లి కూతురు యట్ట బయల్దేరుతుందో అట్ట బయల్దేరింది. ఏనుగు మీద అంబారి గుట్టించి, అంబార్లో కూసుని బయల్దేరింది.

ముందర మంగలోల్లు నాద స్వరము, డోలు వాయిస్తా నడిసినారు. వెనక ముత్తయిదువలు గంగాలాల్లో పసుపు కుంకుమలు పెట్టుకుని నడిసినారు. ఆమె అట్ల పోతా ఉంటే జనం కంటికి మంటికి ఒగిటిగా ఏడ్చినారు. చిన్నమ్మ నేరుగా పోయి చెరువు కట్ట దగ్గర అంబారీ దిగింది. గెండిలో కూసుని మన్నుతోసెయ్యమని వొడ్డెరోళ్ళకు చెప్పింది. బాసింపట్టు ఏసుకుని కండ్లు మూసుకుని దండం పెట్టుకుని కూసునుంది. వొడ్డెరోళ్ళు తలా ఒక పార దీసుకుని మన్నుతోసేసినారు. అదే సినమ్మ కండ్లకు కనపడడం, మల్ల కనపడలా. ఆ పొద్దిట్నుంచి ఈ కట్ట ఒకసారి కూడా గెండి పడలేదు. సినమ్మ కూసుండిన తావున గుడి కట్టించినారు. ప్రతి సుక్కురారం పూజలు జరగుతాయి. సంవత్సరాని కొకసారి జాతర జరుగుతుంది.



# 3

మీరు గనక పడమటి దిక్కు నుంచి ఊర్లోకి ప్రవేశిస్తే మీకు ఇంకొక వింత కనిపిస్తుంది. వూరికి అర కిలోమీటరు దూరాన రోడ్డు ప్రక్కన ఒక చిట్టడవి కనిపిస్తుంది. ఆ చిట్టడవిలో మర్రి మాన్లు, రాగి మాన్లు, కానుగ చెట్లు, తుమ్మచెట్లు, బలిష్ఠమైన బోదెల తోను, శాఖోపశాఖలుగా చీలిన కొమ్మలతోను కనిపిస్తాయి. తీంట్ర తీగలు, బలసతీగెలు సంకీర్ణంగా పెనవేసుకుని ఉంటాయి. దట్టంగా గుబురుగా ఉన్న ఆ చెట్ల సముదాయాన్ని మొదటిసారిగా చూసిన వాళ్లకు కాసేపు వొళ్ళు గగుర్పొడుస్తుంది. ఐదు వందల గడపలుండే గ్రామానికి ఇంత సమీపంగా ఒక కీకారణ్యం ఉండటమేమిటని మీరు ఆశ్చర్యపోతారు. రోడ్డు ప్రక్కన పశువులను మేపుకుంటూ ఉండే పిల్లగాడిని గాని, పేడ ఏరుకుంటూ ఉండే పిల్లదానిని గాని అడగండి. వాళ్ళు ఇలా వివరిస్తారు:

"ఓబు కాలాన అంటే ముప్పై ఏండ్ల కింద ఈ ఊర్లో బక్కిరెడ్డి అనేకాపాయన ఉండె. మారాజును సల్లటి పూట దీపం పెట్టి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=733**

* * *

**Read other books of Dr. Kesava Reddy @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=238**